కథ

# కంచం చదువు?



భారత దేశంలో అత్యధికంగా అక్షరాస్యులు వున్న రాష్ట్రం కేరళ అని చెప్తుంటారు. ఈ విషయం సంగతి ఏమో గాని కేరళ టీస్టాల్స్ మాత్రం చాలా సుదూర ప్రాంతాలలో తప్పనిసరి వుంటాయి. చంద్రమండలంలో తొలిగారిగా దిగిన వ్యక్తిని 'టీ కావాలా సార్" అంటూ కేరళ వ్యక్తి టీ కెటిల్‌తో ప్రత్యక్షమైనట్లుగా జోక్స్ చెబుతుంటారు. వాళ్ళు ఎంత విద్యావంతులో అలాగే వ్యాపారంలో వారికున్న చాకచక్యం, మనుష్యుల్ని ఆకట్టుకోవడం అనే విద్యలు దేశంలో మరెవరికీ లేవంటే నమ్మాల్సిందే మరి.

కేరళ రాష్ట్రంలో లాగానే అత్యధిక విద్యా వంతులు మనరాష్ట్రంలో కూడా వుండాలని ప్రభుత్వం, ఉచితంగా పుస్తకాలు, స్కూలు డ్రెస్, మధ్యాహ్నం పూట భోజనం ఏర్పాటు చేస్తూ ఎవరైనా చదువుకునే వయసు వున్న పిల్లలను పనికి పెట్టుకుంటే వారికి శిక్షలాంటి చర్యలు కూడా చేపట్టింది.

మా ఇంటిచుట్టూ రెండు గదులు వున్న చిన్న మిద్దె ఇళ్ళు సిమెంటు ఇటుకల గోడలపై తాటాకు పరిచిన పూరిపాక కాక, పెంకుటిల్లు కాని ఇళ్ళు

కె.బి.కృష్ణ

అనేకం వున్నాయి. అందరూ కూలిపనులకు, తాపీ పనులకు వెళ్తుంటారు. పిల్లలందరూ స్కూలుకు వెళ్తుంటారు. ఆడామగా కూడా పనులకు వెళ్ళి పోతారు.

ఆ వేళ ఉదయం, రోడ్డుమీద పీకిన పిచ్చి చెట్టుతో, కొడుకుని కొడుతూంది లచ్చమ్మ. వాడు "అమ్మాకొట్టకే" అని ఏడుస్తున్నాడు పొలోమని.

నేను వీధి గుమ్మం దగ్గర నిలబడి "ఏమి టమ్మా పాపం వాడిని అలా బాదుతున్నావ్" అన్నాను.

"చూడండయ్యగారూ. వీడు రేపటి నుండి స్కూలుకు ఎలా వెళ్తాడు, అవి పారేశాడు" అంది కోపంతో ఊగిపోతూ.

"అయ్యో పుస్తకాలు పారేశాడా. పాపం ఎలా చదువుకుంటాడు" అన్నాను.

"అది కాదయ్యగారూ మాయదారి పుస్త కాలున్నయ్. కంచం గ్లాసు పారేశాడు ఎదవ" అంది.

"ఇదేమిటి పుస్తకాలు ఉన్నాయి కదా, చదువుకు అడ్డం ఏమీ లేదు కదా అనుకుని "పోనీలే అమ్మా పుస్తకాలున్నాయి కదా" అంటున్న నా మాటలకు అడ్డు వచ్చి "ఒక పూట అన్నం ఎల్లి పోతుందని ఇద్దరు పిల్లల్నీ స్కూలుకు పంపుతా వున్నామయ్యా. ఆళ్ళు చదువుకుని చేసేదేముంది. కొన్నాళ్ళ తరువాత మాతోపాటు కూలి పనికి రావాల్సిందే" అంది.

"మరి ఇలా మీ పిల్లల్ని చదువులు మాని పించేసేబదులు కనీసం ఒక్కడినైనా చదివించ కూడదూ" అన్నాను.

"చాల్లెండయ్యగారూ. పుస్తకాలు ఇస్తున్నారు, అన్నం పెడుతున్నారు, బట్టలిస్తున్నారు కాబట్టి స్కూలుకు పంపుతా వున్నాం. ఎవురో ధర్మాత్ములు ఇచ్చిన కంచం గ్లాసు పారేశాడు ఎదవన్నర ఎదవ" అంటూ మళ్లీ బాదడం మొదలు పెట్టింది.

"ఏం చూస్తున్నారు చోద్యం. లేబరోళ్ళతో ఏమిటి సోది? లోపలికి రండి" అంది శ్రీమతి. లోపలికి వచ్చి సంగతి చెప్పాను "చాల్లెండి చోద్యం వాళ్ళకి చదువులు ఎందుకు? పొట్టకోస్తే అక్షరం ముక్క రాదు వాళ్ళకి" అంది తిప్పుకుంటూ.

"అది కాదే ఐదో క్లాసులోకి ఎలా వస్తాడు అక్షరం ముక్క రాకుండా" అన్నాను.

"కావాలంటే వాడిని పిలిపించి చూడండి" అంటూ ఛాలెంజ్ విసిరింది.

నేను బయటకు వెళ్ళి ఏడుపు మానేసి, చెక్కముక్కతో క్రికెట్ ఆడుతున్న లచ్చమ్మ కొడుకుని పిలిచి, పుస్తకాలు తెమ్మన్నాను. ఇప్పటిదాకా అమ్మ చితకొట్టింది, ఈయన చదువు చెబుతానంటాడేమో అనుకున్నాడేమో, నన్ను అదోలా చూసి – ఎందుకండి" అన్నాడు.

"నోట్సులు ఎలా రాస్తున్నావో చూస్తానురా" అన్నాను.

తమ మిద్దెలోకి వెళ్ళి, బట్టలకొట్లో ఇచ్చే రంగుల ప్లాస్టిక్ కేరీ బ్యాగ్‌లో పుస్తకాలు పట్టు కొచ్చాడు. నా ఎదురుగా కూర్చున్నాడు. క్యారీ బేగ్ నిండా దుమ్ము లోపల పుస్తకాలు బావుంటాయిలే అనుకున్నాను, కాని వాటినిండా దుమ్మే. సంచి ఎక్కడో విసిరేసి ఆడు కుంటారు కాబోలు పిల్లలంతా.

తెలుగు వాచకం పదో పేజీ వరకూ, ఇంగ్లీషు సగం పేజీలు సోషల్, సైన్స్ సగం చిరిగి పోయి, నోట్సులైతే అట్టల్లో నాలుగేసి కాగితా లున్నాయి. మొత్తం పుస్తకాలు మిఠాయి పొట్లాల్లాగ ముడుచుకొని వున్నాయి.

వాడు ఇదేమీ పట్టనట్లుగా, మా హాల్‌లో కప్‌బోర్డ్‌లో బొమ్మలు, టెలివిజన్ మొదలైనవి వింతగా చూస్తున్నాడు.

శ్రీమతి నన్ను చూస్తూ "అఆలు రాసి చూపించరా" అంది వాడిని.

నేను వెంటనే రియాక్ట్ అయిపోయాను – సీరియస్‌గా. "షేమ్ షేమ్ నువ్వు వాడిని అఆలు రాయమంటావా. వాడెన్నో క్లాసో తెలుసా. ఐదో క్లాసు" అన్నాడు.

"నేను రాస్తానయ్యగారూ" అన్నాడు వాడు.

"షంషేర్. అలా వుండాలిరా. రాయి. ఆ తరువాత నేను నీకు డిక్టేషన్ చెప్తాను" అన్నాను కాస్సేపు మేష్టారి ఫోజు పెట్టి.

వాడు పుస్తకం తీసుకుని, అంగుళం పెన్సిల్ ముక్కతో అ,ఆ,ఇ,ఈ రాశాడు. 'ఈ' రాయడానికి అష్టవంకర్లు తిరిగాడు. ఆ తరువాత స్వస్తి. వాడిని చూస్తున్నాను తల వంచుకుని కూర్చున్నాడు.

"ఇంకా రాయి" అన్నాను.

"వాడు తల గంగిరెద్దులా ఊపి "నాకింక రాదండయ్యగారూ" అన్నాడు స్థిమితంగా.

"మరి మాస్టారు నిన్నెలా ఐదోక్లాసులోకి పంపారురా"

"ప్రతీ సంవత్సరం మమ్మల్ని క్లాసులు మారుస్తారయ్యా అంతే. మేం పరీక్షలు రాసేది లేదు" అన్నాడు సంతోషంగా కళ్ళువిప్పార్చి చూస్తూ.

"చూశారా మరి నేను అంటే మీరు నమ్మలేదు" అంటూ నన్ను ఎత్తి పొడుపుగా చూసింది శ్రీమతి.

రాష్ట్రంలో అత్యధికంగా అక్షరాస్యులు అవుతారని ప్రభుత్వం అనేక సౌకర్యాలు కలిగిస్తుంది. పొట్టకోస్తే అక్షరం ముక్కలు వుండాలని ప్రభుత్వం అనుకుంటుంటే, పొట్టలోకి అన్నం మెతుకులు వుంటే చాలని వీళ్ళ ఆరాటం.

ఏది గెలుస్తుంది ? ఏమో ?

## కళలైనా, కావ్యాలైనా

బీటలు వారిన
నేల కీబోర్డు మీద
చినుకుల వేళ్ళు వినిపించే
చిటపట సంగీతం
అన్నదాత చెవులకు
చిట్టిబాబు వీణలా వుంటుంది.

నాలుగు రోజుల మౌనం తర్వాత
నోరు విప్పిన నీటి ట్యాప్
సన్నగా పాడినా
సుబ్బలక్ష్మిగాత్రమంత బావుంటుంది.

సాహితీ ప్రియుని జఠరపిఠరి
ఆకలి వాద్యం మొదలుపెడితే
కవులుచదివే కమ్మని కవితలు
ఊషర బీజాలౌతాయి.

తనయ మనువు కోసం
తల్లడిల్లే వానికి కావల్సింది
చిన్నవైనా రెండు కళ్ళు
ఆనవాలుగా నైనా ఒక ముక్కు
ఉన్న వరుని ఫోటో కాని
పికాసో చిత్రం కాదు.

అప్పుల బోరు బావిలో పడిన
అభాగ్య ప్రాణానికి కావల్సింది
చేయూత ఆక్సిజన్ కాని
ఆముక్త మాల్యద కాదు.

కళలైనా, కావ్యాలైనా
కడుపు నిండినాకనే
కాలం సహకరిస్తేనే !

– ఉద్దంటి రామమోహనరావు